దొంగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఏసీపీ



రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అప్పగించిన ఏసీపీ కాశిరెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి

హస్తినాపురం: రద్దీగా ఉన్న ప్రదేశాలను టార్గెట్ చేసుకుని దొంగలు సునాయాసంగా మొబైల్ ఫోన్లను చోరీ చేస్తున్నారని, అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వనస్థలిపురం ఏసీపీ పి.కాశిరెడ్డి అన్నారు. అపహరణకు గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, సీఐ వై.అశోక్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, దొంగతనానికి గురైన ఫోన్లను రికవరీ చేయడంలో రాచకొండ పోలీసులు ముందున్నారని, ఎవరి ఫోన్ అయినా అపహరణకు గురైతే బాధితులు వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఈఐఆర్ విధానంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న 31 మంది బాధితులకు ఆయన ఫోన్లను తిరిగి అందజేశారు. కార్యక్రమంలో వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు మాధవరెడ్డి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జంట నగరాల్లోని బంజారా పాస్టర్ల సంక్షేమానికి కృషి

రెవరెండ్ మనోహర్ నాయక్



రెవరెండ్ మనోహర్‌ను సత్కరించిన పాస్టర్ భీముడు నాయక్

సైదాబాద్: జంట నగరాల్లోని బంజారా పాస్టర్ల సంక్షేమానికి కృషి చేస్తానని ట్విన్ సిటీస్ బంజారా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ మనోహర్ అన్నారు. మంగళవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని ఫెయిత్ బాప్టిస్ట్ చర్చిలో బంజారా పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ సికింద్రాబాద్ నగరాలకు చెందిన బంజారా పాస్టర్లు తరచూ సమ్మేళనాల ద్వారా కలుసుకోవడం వల్ల ఐక్యత పెరుగుతుందన్నారు. సంఘంలోని సభ్యులు ఒకరి కష్టసుఖాలను మరొకరితో పంచుకోవడం వల్ల సమస్యల పరిష్కారం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు భక్తిగీతాలు ఆలపించి ఆహూతుల్ని అలరించారు. అనంతరం ఫెయిత్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ భీముడు నాయక్ సంఘ సభ్యులతో కలిసి ఫెలోషిప్ అధ్యక్షుడు మనోహర్‌ను సన్మానించారు. సమావేశంలో రెవరెండ్ కుమార్ నాయక్, రెవరెండ్ మున్యా నాయక్, రెవరెండ్ లాజర్ నాయక్, రెవరెండ్ శ్రీధర్ నాయక్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



వాసవి మాత పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, కాచం సత్యనారాయణ, ఉప్పల రాజ్యలక్ష్మి

ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా

దిల్‌సుఖ్‌నగర్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండి రాణించాలని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. మంగళవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో ఇంటర్నేషనల్ వైశ్య మహిళా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు ఉప్పల రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వాసవి మాత జయంతి ఉత్సవాలు, సంఘం 114వ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి 102 కిలోల ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా మాట్లాడుతూ, అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. వైశ్య వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాచం సత్యనారాయణ మాట్లాడుతూ, వచ్చే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో వైశ్యులు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా అందరూ కలిసి కట్టుగా ఉండి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వైశ్య నేతలు చందా నాగరాజు, దయాకర్, సరిత, కల్పన, పద్మ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



నిరసనలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

బడంగ్‌పేట్: తహసీల్దార్ కార్యాలయం బాలాపూర్ నుంచి బడంగ్‌పేటకు తరలించడాన్ని అఖిలపక్షల నాయకులు ఖండించారు. మంగళవారం బాలాపూర్‌లోని పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు బొర్ర రవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం తరలింపునకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బాలాపూర్ పేరుతో మంజూరైన అర్బన్ హెల్త్ సెంటర్, పోలీస్ స్టేషన్ మీర్‌పేట, మల్లాపూర్‌కు తరలిస్తే స్థానిక నాయకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా నాయకులు పట్టించుకొని తహసీల్దార్ కార్యాలయాన్ని బాలాపూర్‌కు తిరిగి వచ్చేలా చూడాలని కోరారు.

కనుల పండువగా తిరు కల్యాణం

మీర్‌పేట: జిల్లెలగూడ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారి తిరు కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ సంజయ్‌గోపాల్ సైంచర్, ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, కార్పొరేటర్‌లు బొక్క రాజేందర్ రెడ్డి, సిద్దాల శ్రీశైలం, మాజీ ధర్మకర్తలు యాదగిరి ముదిరాజ్, భక్తులు పాల్గొన్నారు.



హరిహరపురం కాలనీలో రోడ్ల మధ్య పేరుకుపోయిన ఇసుక మేటలు

ఆదమరిస్తే ప్రమాదం తప్పదు!

- రోడ్లపై ఇసుక మేటలు
- తొలగింపుపై పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం
- ద్విచక్ర వాహనదారులకు పొంచి ఉన్న ముప్పు

ఎల్‌బీనగర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు వల్ల రోడ్లపై ఇసుక మేటలు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్లను శుభ్రం చేసే పారిశుద్ధ్య సిబ్బంది ఇసుక మేటలను తొలగించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం, హయత్ నగర్ తదితర డివిజన్లలో కాలనీ అంతర్గత రోడ్లపై ఇసుక మేటలు వేసింది. ముఖ్యంగా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని హరిహరపురం కాలనీ, శ్రీకృష్ణ దేవరాయనగర్, వైదేహినగర్ తదితర కాలనీల్లో రోడ్ల మధ్యలో ఇసుక మేటలు ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ఇసుకపై జారి పడే ప్రమాదం ఉందని, పారిశుద్ధ్య అధికారులు స్పందించి వెంటనే ఇసుకను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



కోదండరాంనగర్‌లో రహదారిపై పేరుకుపోయిన చెత్త

ఎక్కడ చూసినా చెత్తే!

- తరలింపుపై నిర్లక్ష్యం
- కాలనీల్లో పేరుకుపోతున్న చెత్త, మట్టి కుప్పలు
- సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పైనా ఇదే పరిస్థితి
- దుర్వాసనతో జనం అగచాట్లు

చైతన్యపురి: కాలనీల్లో శానిటేషన్ పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో రహదారుల పక్కన చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. గడ్డిఅన్నారం డివిజన్‌లోని కృష్ణానగర్, శ్రీనగర్ కాలనీ, కోదండరాంనగర్, శారదానగర్ కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, మట్టికుప్పలు దర్శనం ఇస్తున్నాయి. ఇంటింటికీ స్వచ్ఛ ఆటోలు వచ్చి చెత్త సేకరిస్తున్నప్పటికీ ఇళ్లలోని చెత్తను రహదారుల పక్కనే పడవేయడం అలవాటుగా మారింది. దీంతో కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తకుప్పల వల్ల దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు వ్యాపించి కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- జీహెచ్‌ఎంసీ అధికారులు పర్యవేక్షణ లోపం వల్ల కూడా శానిటేషన్ పనులు సక్రమంగా జరగక సమస్య తీవ్రంగా మారింది. వీటికి తోడు భవన నిర్మాణ వ్యర్థాలను కూడా ఇష్టారాజ్యంగా రహదారుల పక్కనే డంప్ చేసి చేతులు దులుపుకుంటున్నారు.
- విద్యుత్ సిబ్బంది చెట్లకొమ్మలను నరికి వాటిని అలాగే వదిలేస్తున్నారు. చెత్త రహిత కాలనీలుగా రూపుదిద్దుతామని ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు ఉపన్యాసాలు, ప్రకటనలు ఇస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఎలాంటి కార్యాచరణ లేదని ఆయా కాలనీల వారు ఆరోపిస్తున్నారు. చెత్త, బిల్డింగ్ వ్యర్థాలను రహదారుల పక్కన వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారికి చలాన్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.



సరూర్‌నగర్ మినీట్యాంక్‌పై చెత్త కుప్పలు

మినీ ట్యాంక్‌బండ్‌పైనా అదే పరిస్థితి..

సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ డంపింగ్ యార్డుగా మారింది. దారిన వెళ్లే వారు వాహనాలపై వచ్చి తమ ఇళ్లలోని చెత్తను సరూర్‌నగర్ కట్టపై విసిరి వేస్తున్నారు. అవి అలాగే పేరుకుపోయి పర్యాటకులకు అసౌకర్యంగా మారింది. అంతే కాకుండా చెరువు మురికి కూపంగా మారి నీటిపై ప్లాస్టిక్ కవర్లు, చెత్త తేలుతూ అందవిహీనంగా మారింది. మినీట్యాంక్ బండ్‌ను సుందర పర్యాటక కేంద్రంగా మారుస్తామని పాలకులు చెప్పినా ఇంతవరకు అభివృద్ధికి నోచుకోకపోగా రోజురోజుకూ మరింత మురికి కూపంగా మారిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఎప్పటికప్పుడు చెత్త తరలించేలా చూస్తాం



డివిజన్‌లోని కొన్ని కాలనీల్లో రహదారుల పక్కనే చెత్త వేస్తున్న మాట వాస్తవమే. ఇళ్లలోని చెత్తను కూడా కాలనీవాసులు కొందరు కవర్లలో తీసుకొచ్చి వేస్తున్నారు. అలాగే తినుబండారాల విక్రేతలు, చిరువ్యాపారుల వల్ల కూడా చెత్త సమస్య ఉత్పన్నమవుతోంది. చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తూనే ఉన్నాం. వాహనాల కొరత వల్ల తరలింపులో జాప్యమవుతోందని చెప్తున్నారు. కాలనీ రహదారుల పక్కన చెత్త వేయకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. కాలనీవాసులు కూడా సహకరించాలి. ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా చూస్తాం.

–బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- **ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు...** ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, న్యూహనుమాన్ టెంపుల్, భవానీనగర్, ద్వారకాపురి, ప్రతాప్‌నగర్, భాష్యం స్కూల్ పరిసర ప్రాంతాలు.
- **మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు...** శ్రీపురం కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, ఈస్ట్ ప్రశాంత్ నగర్, అరోరా కాలేజీ ఎదురు, రామాలయం పరిసర ప్రాంతాలు.
- **మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు...** క్యాపిటల్ హోటల్, ఆస్మాన్‌ఘడ్, టీకే ఫంక్షన్‌హాల్ వెనుక వైపు, ఆంధ్రాబ్యాంక్ కాలనీ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

చంపాపేట సబ్ స్టేషన్ పరిధిలో...

చంపాపేట: విద్యుత్ మరమ్మతుల కారణంగా చంపాపేట సబ్ స్టేషన్‌పరిధిలోని కింది ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.

- **ఉ.11 నుంచి మ. ఒంటి గంట వరకు ...** అంజిరెడ్డి కాలనీ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని అంజిరెడ్డి, ప్రెస్, సాయిరాంనగర్, న్యూపద్మానగర్, ఎంఆర్‌ఆర్, ఉదయ్‌నగర్, పవన్‌పురి, విష్ణుపురి కాలనీ పరిసరాలు.
- **మ. ఒంటి గంట నుంచి మ. 2.30 గంటల వరకు..** పద్మానగర్ ఫీడర్ పరిధిలోని పద్మానగర్, క్రాంతినగర్, రాఘవేంద్ర, నిర్మలానగర్, జ్యోతినగర్, కర్మన్‌ఘాట్ పాతబస్తీ పరిసరాలు.
- **మ. 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు..** రియల్ బేకరీ ఫీడర్ పరిధిలోని బాలాజీ, సూర్యానగర్, వంగా శంకరమ్మ, మైత్రినగర్, కర్మన్‌ఘాట్, హనుమాన్ ఆలయ పరిసర ప్రాంతాలు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: బాలాపూర్, కొత్తపేట ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బాలాపూర్ ఫీడర్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, పహాడీ షరీఫ్ పరిధిలోని కొత్తపేట ఫీడర్ పరిధిలో 12.30నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజు తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని కాలనీలోని వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 23, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 28, ఆలు 32, ఉల్లి 24, గోకర 40, దోస 23, సొర 11, పొట్ల 18, అరటి 08, చిక్కుడు 70, అర్వి 45, మునగ 45, బీట్‌రూట్ 19, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 45. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఘనంగా 'రేణుక ఎల్లమ్మ' ఆలయ వార్షికోత్సవం



వేడుకుల్లో పాల్గొన్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ వినాయక్ నగర్ కాలనీలోని బంగారు గవ్వల రేణుకా ఎల్లమ్మ ఆలయం 14వ వార్షికోత్సవం, కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. కొత్తపేట బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్, ఆలయ చైర్మన్ కట్ట వెంకటేశం స్వామి, కృష్ణమూర్తి, సురేందర్, విజయరంగా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన నారసింహ హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

మన్సూరాబాద్: నారసింహ జయంతి సందర్భంగా విజయశ్రీ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సుదర్శన నారసింహ హోమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి, ఏనుగు చంద్రారెడ్డి, బోడిగే లోకేశ్వర్‌గౌడ్, పోరెడ్డి రమణారెడ్డి, యనాల కొండల్‌రెడ్డి, అరవింద్‌కుమార్‌గౌడ్, భీమిడి నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దూస సత్యనారాయణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి

జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి



అధికారులతో సమావేశమైన వాణిరెడ్డి

పహాడీషరీఫ్: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ ఎ. వాణిరెడ్డి సిబ్బందికి సూచించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం ఆమె సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మున్సిపాలిటీలోని పురాతన ఇళ్లలో ప్రజలు నివాసం ఉండొద్దన్నారు. అలాంటి భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలన్నారు. ముఖ్యంగా రోడ్లపై నీరు నిలువకుండా సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీ పైప్‌లైన్లు బ్లాక్ అయినట్లయితే వెంటనే నీరు వెళ్లేలా వ్యర్థాలను తొలగించాలని సూచించారు. అత్యవసర సమయంలో ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ (7330 877 393)కు ఫోన్ చేయాలని ఆమె సూచించారు. సమావేశంలో మేనేజర్ యెన్నం సుదర్శన్, డీఈ వెంకన్న, పారిశుద్ధ్య విభాగం అధికారులు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో చోరీ

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ మాదన్నపేట బోయబస్తీలోని వీరాంజనేయ ఆలయంలో దొంగలు పడి హుండీలోని కానుకలు ఎత్తుకెళ్లారు. సోమవారం ఈ ఘటన జరిగిందని ఆలయం కమిటీ వారు మాదన్నపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు... సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వచ్చిన పని మనిషి ఆలయంలోని హుండీ తెరిచి ఉండటం గమనించి కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చింది. ఆలయానికి చేరుకున్న సభ్యులు హుండీలోని కానుకలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టపగలు ఆలయం చోరీ జరగడం ఆశ్చర్యానికి గురి చేస్తోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఊరెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

హస్తినాపురం: సొంతూరులో జాతరకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు, వెండి నగలతో పాటు నగదును దొంగిలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జక్కిడి రాంరెడ్డి నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఉదయ్ భాస్కర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం సజ్జాపురం గ్రామంలో జరుగుతున్న జాతరకు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఇంటికి తాళంవేసి వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం వచ్చి చూసేసరికి ఇంటి కిచెన్ కిటికీ గ్రిల్ తొలగించి ఉంది. బీరువాలోని 14 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి వస్తువులు, రూ.80 వేలు దొంగలు ఎత్తుకెళ్లారు. వనస్థలిపురం పోలీసులకు ఉదయ్‌భాస్కర్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పించిన రాజశేఖర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చౌకి రవికుమార్, రాజేందర్ యాదవ్, మహ్మద్‌గౌస్, నర్సింగ్‌రావు, ప్రకాష్ భట్టాచార్య, అరవింద్ పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సేవలు ఎనలేనివి..

వనస్థలిపురం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశాభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనివని కాంగ్రెస్ పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహ యాదవ్ అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం వనస్థలిపురం రెడ్‌వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తపేట చౌరస్తాలో ... నాగేశ్వర్‌రావు, కిషోర్‌గౌడ్ తదితరులు

కొత్తపేట చౌరస్తాలో...

నాగోలు: కొత్తపేట చౌరస్తాలోని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల కిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పార్టీ నాయకులు లింగాల నాగేశ్వర్ రావు, రెడ్డి జేఏసీ చైర్మన్ బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి, చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

చంపాపేట డివిజన్‌లో..



ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షుడు జితేందర్

డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బైరామల్‌గూడలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. చంపాపేట మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, హనుమాన్ టెంపుల్ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ప్రకాష్‌గుప్తా, బద్రినాథ్ పాల్గొన్నారు.



చంపాపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

సైదాబాద్‌లో బాలిక అదృశ్యం

సైదాబాద్: దుకాణానికి అని ఇంటి నుంచి వెళ్లిన బాలిక కనిపించకుండాపోయింది. సైదాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శంకేశ్వర బజార్‌లో నివసించే అల్లాఉద్దీన్, సుల్తానా బేగం దంపతుల కుమార్తె హసీనా ఖాతూన్ (17) ఇటీవల పదో తరగతి పూర్తి చేసి ఇంట్లో ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం సమీపంలోని దుకాణానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన హసీనా ఖాతూన్ ఎంతకూ తిరిగి రాలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. మినాజ్ ఆలం అనే యువకుడిపై అనుమానం ఉందంటూ బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాళ్లవాపు చికిత్సకు వస్తే ప్రాణం తీశారు..?

మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన



హాస్పిటల్ ఎదుట ఆందోళన చేస్తున్న రోగి కుటుంబ సభ్యులు



మృతుడు రమేష్ (ఫైల్)

మన్సూరాబాద్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా రోగి మృతి చెందాడని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేసిన ఘటన ఎల్‌బీనగర్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. రోగి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతలపల్లికి కాసారపు రమేష్ (35) దేవరకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అటెండర్. అతడికి భార్య అపర్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాళ్లు వాపు వచ్చాయని, ఛాతీలో మంట వస్తోందని ఎల్‌బీనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు చికిత్స కోసం వచ్చాడు. వైద్యులు పరీక్షించి గుండెలో వాల్ బ్లాక్ అయ్యిందని, స్టంట్ వేయాలంటూ చికిత్స అందించారు. మంగళవారం మధ్యాహ్నం స్టంట్ వేస్తామని రమేష్ కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిపారు. ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లిన వైద్యులు ఎంతసేపటికీ రోగిని బయటకు తీసుకురాకపోవడంతో బంధువులు హాస్పిటల్ వైద్యులను నిలదీయగా వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని వివరించారు. సుమారు 4 గంటల సమయంలో పోలీసుల సహకారంతో రోగిని మలక్‌పేట్‌లోని యశోదా హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన హాస్పిటల్ సిబ్బంది రమేష్ అప్పటికే మృతి చెందాడని చెప్పారు. దీంతో మృతదేహాన్ని ఎల్‌బీనగర్‌లోని సదరు హాస్పిటల్ ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గొడవ తీవ్రతరం కాకుండా ఎల్‌బీనగర్ పోలీసులు హాస్పిటల్ ఎదుట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై ఆరెంజ్ హాస్పిటల్ యాజమాన్యం వివరణకు ప్రయత్నించగా ఎవరూ అందుబాటులో లేకుండాపోయారు.